IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# అనుమాండ్ల భూమయ్య మకర హృదయావిష్కరణ

బి.మహేష్,

పరిశోధక విద్యార్థి,

హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

"భూమయ్య రూపమైన దేవి స్తుతిలో భూమయ్య కవితాస్వరూపం, భూమ(య్య) మానసికావస్థ పరాకాష్ఠనందిన కవితాసంకలనం "వేయి నదుల వెలుగు", "వెలుగు నగల హంస"లనే రూపంతో సహృదయుల హృదయాల్లో తిష్ట వేసింది. ఇంత సరళమైన వ్యక్తీకరణం, ఇంత మృదువైన కవిత, ఇంత సులభంగా ఇమిడే ఛందస్సు, ఇంత తియ్యని మాతృభావన అనిదంపూర్వమైన ఆనందలోకాల్లో విహరింపజేస్తూ భావహరమై "పుట్టుకల బాధ తొలగదో! అన్నట్టే ఉన్నద"ని సంగనభట్ల నరసయ్య భూమయ్య గురించి అన్నారు. తెలుగుసాహిత్యంలో పద్యకవిగా ఆచార్య అనుమాండ్ల భూమయ్య తన కలంనుండి "వేయి నదుల వెలుగు", "వెలుగు నగల హంస", "అగ్నివృక్షం", "అమృతసేతువు", "జ్వలిత కౌసల్య", "అరుణాచలరమణీయం", "చలువపందిరి", "అష్టావక్రగీత", "త్రిజట", "ప్రవరనిర్వేదం", "మకర హృదయం", "కబంధమోక్షం", "పారిజాతావతారణం" మొదలగు పద్యకావ్యాలను రచించారు.

భూమయ్య పద్యకావ్యాలను అత్యంత రమణీయంగా రాస్తున్నారు. ఇరవైఒకటవ శతాబ్దంలో పేర్కొనే పద్యకవులలో అనుమాండ్ల భూమయ్య ఒకరు. భూమయ్య పద్యకావ్యాలేగాక, సాహిత్యవిమర్శ "వేయి పడగలు : ఆధునిక ఇతిహాసం", "వ్యాసభారతి", "ఆద్యుడు కట్టమంచి", "మాలపల్లి : అభ్యుదయ మహాకావ్యం", "వ్యాసభుమి", "ఆధునిక కవిత్వంలో దాంపత్యం", "కర్పూర వసంతరాయలు: కథా కళా ఝుంకృతులు", "తెలంగాణ భావవిపంచిక : గోలకొండ కవుల సంచిక" మొదలగు విమర్శ గ్రంథాలు రాశారు. పేద కుటుంబంలో జన్మించిన భూమయ్య విశ్వవిద్యాలయస్థాయిలో విద్యాభ్యాసం చేసి, పరిశోధకుడుగా పేరు సంపాదించారు. "నాయని సుబ్బారావు కృతులు – పరిశీలన", "కొరవి గోపరాజు : సాహిత్య విశ్లేషణ"లతో పరిశోధన మొదలుకొని నేటికి సాహితీపరమైన రచనలు కొనసాగిస్తున్నారు. భూమయ్య రచనల్లో ప్రాచీన గుణాలు, తాత్త్వికత, భారతీయతను జోడించుకొని మంచి భావకుడిగా కవితారంగంలోకి ప్రవేశించిన మేటి కవి భూమయ్య.

భూమయ్య రచనల్లో పద్యరచనలకు ఒక విశిష్టస్థానం ఉంది. భూమయ్య పద్యకావ్యాలలో ప్రాచీన భావాలు, మానవతా విలువలు, తాత్త్వికచింతన, ఆధ్యాత్మికభావంతో కూడి ఉంటాయి. వాటిని నేటి సాహితీలోకానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. భూమయ్య ప్రాచీనగ్రంథాలలోని అసమగ్రమైన పాత్రలకు సజీవమైన ప్రాణం పోశారు. భూమయ్య తన రచనల్లో అసమగ్ర అంశాలకు జవాబు ఇచ్చిన కవుల్లో నేటి ఆధునిక పద్యకవి. భూమయ్య కరుణరసార్ద్రత హృదయంగా రచించిన కావ్యాల్లో మకర హృదయం పద్యకావ్యం ఒకటి. భూమయ్య పోతన రచించిన భాగవతంలోని గజేంద్రమోక్షం సంఘటననే ప్రధాన వస్తువుగా తీసుకొని రాశారు. మూలంలో పోతన రాసిన గజేంద్రమోక్షం ఘట్టాన్ని సందర్భానుగుణంగా జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకొని రాశారు. కొత్త కోణాన్ని దర్శించి, విశ్లేషించారు. గజేంద్రమోక్షంలో మహావిష్ణువుకి గజేంద్రుడు తాను ఆపదలో ఉన్నానని మొర పెట్టుకోగానే పరుగుపరుగున విష్ణుమూర్తి వచ్చి మకర శిరస్సును ఖండించివేస్తాడు. కానీ వాస్తవంగా మకరి చేసిన తప్పేమిటి? అనే కోణంలో ప్రధాన వస్తువుగా తీసుకొని కవి భూమయ్య “మకర హృదయం” కావ్యాన్ని రాశారు. ఈ కావ్యంలో ప్రధాన వస్తువుగా మకరి హృదయాన్ని, ప్రశ్నించే తత్త్వాన్ని కవి భూమయ్య ఆవిష్కరించారు. మకరి ఇబ్బందులను ఎదుర్కోన్నది. కరి చేసిన తప్పుకు శ్రీహరి మకరికి శిక్ష ఎందుకు విధించాడని ప్రశ్నిస్తుంది.

## కరి కొలనులో చేసిన విధ్వంసం

మకరితోపాటు చరజీవులు కొలనునే ప్రపంచంగా భావించి నివాసాన్ని ఏర్పరుచుకున్నాయి. మకరి ఉన్న కొలనులోకి దిగి ఏనుగు నీటిని చెల్లాచెదురు చేస్తుంది. కరి విధ్వంసం చేయడాన్ని కవి భూమయ్య వస్తువుగా స్వీకరించారు. కరి చేసే ప్రళయాన్ని తట్టుకోలేక, ప్రాణులన్నీ హరి హరి అని ప్రాధేయపడ్డాయి. వాటి ఆర్తనాదాలు వినిపించలేదా? అని మకరి శ్రీహరిని ప్రశ్నిస్తుంది. కరులన్ని నీటిలోకి దిగి విచ్చలవిడిగా విహారాలు చేస్తున్నవి. భయంకరమైన శబ్దాలు ఏనుగులు చేశాయి. నీటిలోని జీవుల ఏడుపులు ఎవరికి వినిపించకుండా చేశాయి. ఈ కరి కొలనులో చేసిన విహారంలో ముసలి పిల్లలు నలిగిపోయాయి. మకరిని కూడా తొక్కడానికి ప్రయత్నించగానే ఆగ్రహించింది. కరి ఎత్తిన పాదము అలాగే ఉండగానే మకరి నోటితో పట్టుకుంది. మకరిని విడిపించుకోవడానికి సాధ్యం కాలేదని కరి శ్రీహరితో తన బాధను చెప్పుకుంటుంది. ప్రధానంగా శ్రీహరితో మకరికి జరిగిన అన్యాయాన్ని వస్తువుగా తీసుకొని కవి అనుమాండ్ల భూమయ్య “మకర హృదయం” కావ్యాన్ని రాశారు.

## ధర్మబద్ధ నియమాలు

ధర్మ, అధర్మాలను విచారించకుండా కరి మొరపెట్టుకోగానే శ్రీహరి వచ్చి కాపాడాడు. కరుణగలవాడని శ్రీహరిని లోకమంతా పొగిడింది. కానీ శ్రీహరి మకరిని సంహరించి జీవితం లేకుండా చేశాడు. మకరి నివాసం ఉండే చోటుకు కరి వచ్చి అల్లకల్లోలం చేసింది. ఇది ధర్మమా అని మకరి శ్రీహరిని ప్రశ్నిస్తుంది. ఏనుగులకు విశాలమైన అడవులలో తిరగడానికి అవకాశం ఉంది. ఎవరు ఎక్కడ జీవించాలో నిర్ణయించింది శ్రీహరి. కానీ దాని సరిగా అమలు జరపలేదని మకరి బాధపడ్డ సందర్భాన్ని కవి అనుమాండ్ల భూమయ్య వస్తువుగా తీసుకున్నారు.

# కరుణరసార్ద్రకం

మకరికి జరిగిన అన్యాయం గురించి కవి భూమయ్య మాట్లాడుతూ శ్రీహరి నిజానిజాలను గుర్తించాల్సిందనుంటున్నారు. ప్రియురాలతో కలిసి వచ్చింది కరి. ఈ భూలోకంలో శ్రీహరి సృష్టించిన అద్భుత వస్తువులను కరి నాశనం చేసింది. కొలనులో ఉన్న ఎన్నో జీవులు ప్రాణాలు విడిచాయి. మౌనంగా హరి అని పిలిస్తే వినపడదా శ్రీహరికని మకరి అడుగుతుంది.

# సమానత్వ భావన

శ్రీహరి అందరిపై సమానమైన ప్రేమ చూపించాలే తప్ప ఒకరిని ఎక్కువ మరొకరిని తక్కువ చూడరాదంటున్నాడు కవి భూమయ్య. ఒకరు పెద్ద మరొకరు చిన్నవారనే భేదభావం ఉండకూడదు. పసిగుడ్డునుంచి కళ్ళు తెరవని మకరి పిల్లలు ప్రాణాలు వదిలాయి. అప్పుడు కూడా విష్ణువుకు కనిపించలేదా? కరి, మకరి సంవాదంలో గడియలు, సంవత్సరాలు గడిచాయి. ఒక్కపూటైన మకరుల ఏడుపులు వినిపించలేదు. రాత్రి ఏదో పగలు ఏదో తెలియని జీవితాలు మకరులవి. బయట ఏమి జరుగుతుందో గ్రహించలేదు. నిండైన మనసుతో శ్రీహరిని పూజిస్తామని మకరి తన ఆవేదనను తెలుపుతుంది. దొరికిన కాడికే సంతృప్తిగా తింటారు తప్ప అనవసరంగా ఎవరికి హాని తలపెట్టమని మకరి చెబుతుంది. బీదల జీవితాలను వస్తువుగా తీసుకొని కరి తరపున కవి భూమయ్య మాట్లాడారు. మకరిని పేదవానికి ప్రతీకగా చెప్పారు. పేదవానితో ఏమి ఆయుధాలు ఉంటాయి. దొరికితే తింటాం. లేదంటే పస్తులుంటాం. కష్టాలు వచ్చినా కంటనీరు పెట్టలేదు. పేదవాడి కంటనీరు ఎవరూ ఇష్టపడరు.

“కాలమే తెచ్చె ఇన్ని నా కష్టములను

కాలమే కొనిపోవు నీ కష్టముల న

టంచుకనెద కాలగతిని, ఇంచుకైన

నే చలింప, కాలమునందు నిన్ను గనుచు”.

(మకర హృదయం: పద్యం:38, పుట:162)

తప్పు చేసింది ఎవరో తెలుసుకోకుండా మకరికే శ్రీహరి శిక్ష విధించాడు. పేదవాడికి ఎప్పుడు న్యాయం దొరకదా? బలవంతులే తప్ప బీదవాడి కన్నీరు కనిపించదా? వాదనలు విన్న తర్వాత ఏ శిక్ష అయిన శ్రీహరి విధించవచ్చు. కానీ వాదనలే లేకుండా ఎలా శిక్షిస్తావయ్యా శ్రీహరి అని మకరి అడుగుతుంది. పేదవారికి నీవే దిక్కని నమ్ముకుని ఉన్నాం. కానీ శ్రీహరి వమ్ము చేశాడని మకరి వాపోతోంది. శ్రీహరి నీవే ధర్మశాస్త్రాలను రాశావు. వాటిని ఎవరు అధిగమించకూడదన్నావు. శ్రీహరియే దర్మం తప్పితే ఇక ఎవరు ప్రశ్నిస్తారు. ఈ సృష్టిలో పేదలు, బలహీనులే అధికసంఖ్యలో ఉన్నారు. వారి రక్షణ కోసమే కదా ఇవన్నీ రాశాడు. మకరులు హరి అని పిలిచిన వెంటనే బలవంతుల పక్షాన నిలిచాడు. ఇక ఫలితం ఏమీ ఉంది. బలవంతులు ఈ బీదలను ఎంతగా హింసిస్తున్నారో ఎరుగలేదు. శ్రీహరి అండదండలతో ఏనుగులు రెచ్చిపోయాయి.

# ధర్మబద్ధత

ఎవరైనా సరే ధర్మంవైపు నిలబడడం ముఖ్యం. ధర్మమే ఎవరికైనా బలం కావాలి. కండబలం బలం కాకూడదు. తప్పు చేసేవాడే ఆధర్మంవైపు నిలబడతాడు. ధర్మబద్ధంగా ఉన్నవాడికే శిక్ష పడుతుంది. సరస్సులోని జీవుల గురించి వస్తువుగా చేసుకుని కవి అనుమాండ్ల భూమయ్య వివరిస్తున్నారు. హంసలు, బాతులు, చక్రవాకాలున్నాయి. ఈ సరస్సు స్వర్గంలాంటిది. సాలవృక్షాలు, తియ్యమామిడిలు, పూలపొదరిండ్లున్నాయి.

# కరులు చేసిన విధ్వంసం

కరి తన ఆనందం కోసం వృక్షాలను విరిచింది. ఇతర ఆడ కరులు కూడా సంతోషంతో నీటిలోని జీవులను చెల్లాచెదురు చేశాయి. తొండములతో నీళ్లు నింపుకొని చల్లుకున్నాయి. నీటిలోని చేపలు, మకరాలు ఎగిసిపడ్డాయి. పసిమకరుల ఏడుపులను ఎవరు వినిపించుకోలేదు. కమలములను పెకిలించి విసిరివేశాయి. ఎన్నో జీవులు ఈ సరస్సులో నివాసం ఉంటున్నాయి. కొలనులో జీవులు నివాసం ఉండే చోటికి వచ్చి కరులు బాధపెట్టాయి. వాటి తప్పులు ఎంచకుండా మకరుల్ని తప్పు పట్టడం భాగ్యమా అని మకరి శ్రీహరిని ప్రశ్నిస్తుంది. కొన్ని సందర్భాల్లో పేదవారు ఉండే బస్తీలలో ధనవంతులు ఫ్యాక్టరీల కోసమని, పట్టణాల సుందరీకరణ కోసమని అభివృద్ధి పేరిట వారి నివాసాలను చెదరగొట్టే ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. న్యాయస్థానాలకు వెళ్ళినా పేదలకు సరైన న్యాయం జరుగదు. కరిజాతికి రాజు కావచ్చునేమో కానీ మకరిజాతికి మకరి రాజు. ఒకరిపక్షాన శ్రీహరి నిలబడడం న్యాయం కాదేమో ఒకసారి ఆలోచించమని శ్రీహరికే న్యాయాన్ని నిర్దేశిస్తుంది మకరి. ఇతరులను పీడించే వారికి శ్రీహరి పట్టమేలకడతాడు. నిజంగా ఎవరి పక్షాన నిలబడతావో శ్రీహరి మనసు విప్పవయ్యా! మకరి కరి బలవంతుడు అనుకున్నది. ఈ పోరులో చివరికి మకరియే గెలిచింది. మకరిని అభినందించాలి కానీ శ్రీహరినుంచి అలా జరగలేదు.

## శ్రీహరిని(నిందా)స్తుతించుట:

విష్ణుమూర్తియే లోకాన్ని సృష్టించింది. శ్రీహరియందే జగమంతా లీనమైంది. మూలమే శ్రీహరి. అంతటికి సర్వం. జగాన్నంతటిని భరించేవాడు.

"కలవు దీనుల యెడనని, కలవు దిక్కు

లన్నిటనని నమ్మితిని, రావయితివేమి

దీనమ్మ కారములను ద్రోవదిక్కు వగుచు?

కాలనీ దిక్కునకైన రావాలదో చూడ?!".

(మకర హృదయం: పద్యం:75, పుట:168)

శ్రీహరి ప్రాణాలు పోతున్న ఈ మకరులను కాపాడడానికి రాలేదు. ప్రకృతి బాధపడిన రాలేదు. అన్ని రూపాలలో హరియే ఉన్నాడు. తప్పు చేసింది కరి. దీనుడనని శరీరం శక్తి కోల్పోయిందని శ్రమ పడలేనని, శ్రీహరి దిక్కననగానే పరిగెత్తుకుంటూ వచ్చాడు. శ్రీహరి ఇది భావ్యమైన పనేనా అని అడుగుతున్నాడు. మకరి తప్పులు ఎన్నో చేసి మా తప్పులు మన్నింపమని వేడుకోగానే కనికరించి వదిలివేస్తావు. జీవితం ఇస్తావు. ఏ తప్పు చేయనివారికి కూడా ఎందుకు శిక్షిస్తావని మకరి ప్రశ్నిస్తుంది. ఈశ్వరుడవై ఈ సృష్టిని అవతరింపజేశాడు. నూరేళ్లు జీవించమని మకరిని దీవించాడు. మంచి పనులు చేసే మార్గాన్ని చూపించాడు. ఎప్పుడు మేము ఏ తప్పు చేయకున్నా మరణాన్ని శిక్షగా విధించాడు. ప్రాణులలో జీవించే శ్రీహరి చిన్ని ప్రాణులను రక్షించడానికి రాలేదు! కరి అహంకరించి ఏమీ తెలియని ప్రాణాలను అపహరించింది. పూర్వజన్మలలో చేసిన పుణ్యాలను గుర్తు చేసుకుని కరిని రక్షించాడు. కానీ ఇప్పుడు ఏ పుణ్యాలు చేయకపోతే రక్షించవా అని ప్రశ్నిస్తున్నాడు. శ్రీహరిని మకరి చంపటం భావ్యం కాకున్నా శ్రీహరిని ఎవరు ప్రశ్నిస్తారనే గర్వం కావచ్చు. శ్రీహరియందే మా జీవితం ఉన్నది. శ్రీహరి నీవు నాకు దూరంగా ఉంటే కదా నిన్ను ప్రార్థించేది.

ఎవరి స్థానబలం వారికుంటుంది. మకరికి జలమే బలం. కరికి వనాలే బలం. కానీ కరిని నీటి బలంలో గెలిపించడం సమంజసమా అని మకరి శ్రీహరిని అడుగుతుంది. ఒకవేళ నీవు వచ్చిన కరికి బలం ఇచ్చి గెలిపించవలసింది. శ్రీహరి తన ప్రాణాలను తీసేంత తప్పేమి చేశానని మకరి బాధపడుతుంది. మకరి బలాన్ని తగ్గించవలసింది.

# మకరుల నివాసంపై వల్లమాలిన ప్రేమ

మకరులు నివసించే సరస్సును కేవలం సరస్సుగానే చూడడం లేదు. తమ ప్రాణాలతో సమానంగా భావిస్తారు. మకరులకు దేవాలయం ఈ కొలను. ఏ బాధ కలిగిన మకరుల శరీరానికి బాధ కలిగినట్లు భావిస్తాయి. బ్రతుకుతెరువునిచ్చిన ఈ పవిత్రమైన కొలను అంటే మకరులకు అమితమైన ప్రేమ ఉంది. కృతజ్ఞతభావం ఉంది. కొలనును తల్లిలాగా భావిస్తారు. ఎల్లవేళలా నమ్ముకున్న దైవాన్ని మనసులో నిరంతరం స్మరిస్తూనే ఉంటారు.

# కరికి మకరికి జరిగిన బల సంవాదం

కరిని మకరి బలంగా లోపలికి లాగింది. కానీ కరి బయటపడటానికి ప్రయత్నించింది. కరి, మకరి మధ్య పోరు సాగుతుండగా శ్రీహరి ప్రవేశించాడు. అంతులేని ఉత్సాహం అలసట పెరగకుండా గెలుపుపైననే మనసుపెట్టి మకరి పోరాడింది. కరియే బలవంతుడని నమ్మింది. శ్రీహరిచ్చిన శక్తిని కరి గుర్తించలేదు. కరి శ్రీహరిని ప్రాధేయపడినట్టు చేయకున్న మకరి మాత్రం మనసులో కోరుకుంటూనే ఉంది. అయినా శ్రీహరి మకరి తలను త్రుంచి వేశాడు. స్థానబలం ఎవరికైన బలమే. కానీ అచటనే గెలుపు లేకుండా శ్రీహరి చేశాడు. కానీ ఈ ఓటమి శ్రీహరిదే తప్పు మకరి చెబుతుంది. అవసరానికే కరి ప్రార్థించింది. ఆపదలు ఉంటేనే అక్కరపడతావా? కరులు వేలకువేలు వచ్చి మకరుల కంటనీరు ఇంకిపోయినట్లు జలకములు ఆడాయి. చేయని నేరానికి శ్రీహరి మకరికి శిక్ష వేశాడు. శ్రీహరి జాతి నాశనానికే శ్రీకారం చుట్టినట్లయిందని మకరి బాధపడుతుంది. కరి బాధను తెలుసుకున్నాడు. కానీ మకరుల బాధలు గుర్తించలేదు. శ్రీహరి పాంచజన్యంతో నాలుగు దిక్కులకు వినిపించాడు. యుద్ధం ప్రకటించని మకరిపై శ్రీహరి గెలవడానికి సిద్ధమయ్యాడు. అన్నింటిలో సాటిరాలేని మకరిపై యుద్ధం చేయడం సమంజసం కానేకాదు.

"ఆకాసమ్ము, వాయు వు, జల మగ్ని భూమి

యందున మకర ప్రాణమ్ములైదు కలిసి

ఐదు రీతుల ప్రశ్నింప హరి జవాబు

కెదురుచూతురు సురలును హృదయమిచ్చి".

(మకర హృదయం: పద్యం:123, పుట:176)

మదంతో కూడిన కరిపై ప్రేమ చూపడం ఏమిటి? ఒకరిని రక్షించడానికి మరొకరిని శిక్షించటం న్యాయమా? శత్రువే కానటువంటి మకరిని శత్రువుగా భావించటం తగదని కవి భూమయ్య అభిప్రాయపడుతున్నాడు. ఇంత చిన్న విషయానికి దేవతలు దుంధుబిల్ని మోగించి సంతోషపద్దారు. మకరి ఎవరిపైనైనా యుద్ధం చేయడానికి సిద్ధమయ్యిందా? ఇంద్రుడిని ఓడించిందా? దిక్కులన్నింటా దోరల పీఠాలు ఎక్కిందా? బడుగులపక్షాన పండుగల చేసుకోవటం స్వర్గపురం కాదు.

**ఆధార గ్రంథాలు:**


1. రాధాకృష్ణ, బూదరాజు. పద్య సాహిత్యం–సంఘ చరిత్ర. హైదరాబాద్, ప్రాచీ పబ్లికేషన్స్, 2005.

2. భూమయ్య, అనుమాండ్ల. అంతర్వీక్షణ సార్వభౌమం. వరంగల్, మనస్విని ప్రచురణలు, 2003.

3. భూమయ్య, అనుమాండ్ల. భూమయ్య పద్యకావ్యాలు (షోడశ పద్యకావ్య సంపుటి), హైదరాబాద్, అజో–విభొ–ప్రచురణలు,2023.

4. భూమయ్య, అనుమాండ్ల. జ్వలిత కౌసల్య. వరంగల్, మనస్విని ప్రచురణలు, 2011.

5. లక్ష్మణరావు, గంద్ర. తెలంగాణ పద్య కవితా వైభవం. హైదరాబాద్, తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు, 2017.